క్లుప్తంగా

వైద్య సేవలకు సెలవు !



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని కోట గడ్డ వీధి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యుడి కొరతతో వైద్య సేవలకు సెలవు ప్రకటించారు. ఇక్కడ పనిచేస్తున్న డా.షరీఫ్ నెల రోజుల క్రితం పీజీ చదువు కోసం తమిళనాడుకు వెళ్లాడు. అప్పటి నుంచి నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుడు భార్గవ్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఒకే వైద్యుడు రెండు చోట్ల వైద్యం అందించలేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందుబాటులో లేదు. వైద్యశాలలో పరికరాలు, మందులు ఉన్నా వైద్య సిబ్బంది కొరత ఏర్పడటంతో వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోయింది.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు



ముస్లింలకు విందు వడ్డిస్తున్న రాంబాబు

పొదిలి రూరల్: పవిత్ర రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో పొదిలిలోని షమ్స్–ఉల్–ఉలూమ్ కాలేజీలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా వెంకట రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఉపవాస ప్రార్థనలు ఫలించి సమాజానికి మంచి జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న అందరికీ విందు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో షంషీర్ ఆలీ బేగ్, కేవీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్య



శిక్షణకు హాజరైన సీడీపీఓ, సూపర్‌వైజర్లు

తర్లుపాడు: ఆటపాటలతో అంగన్‌వాడీ విద్యను చిన్నారులకు అందించాలని సీడీపీఓ బి.సుశీలాదేవి తెలిపారు. మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కలుజువ్వలపాడులోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల మానసిక, శారీరక స్థితిగతులను గమనిస్తూ మేధాశక్తి అభివృద్ధి చేయాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించే విధంగా బోధన చేయాలన్నారు.

11 మద్యం బాటిళ్ల స్వాధీనం

మార్కాపురం టౌన్: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఒక హోటల్లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. మద్యం అక్రమంగా అమ్మినా, బెల్టు షాపులు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

సై టీబీ పరీక్షతో టీబీ నిర్ధారణ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాహుల్

మార్కాపురం: సై టీబీ పరీక్షతో టీబీ సోకిందో లేదో నిర్ధారించవచ్చని సీనియర్ వైద్యాధికారి డాక్టర్ కె.రాహుల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఏఎన్ఎంలకు, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సై టీబీ టీకా పరీక్ష చేసే విధానం గురించి వివరించారు. టీబీ సోకిన వ్యాధిగ్రస్తులకు, మందులు వాడే వారికి గతంలో 500 రూపాయలు ప్రభుత్వం అందించిందని, ఇప్పుడు 1000 రూపాయలకు ప్రభుత్వం పెంచిందని అరవింద ఘోష్ వీధిలోని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రావణ్‌తేజ తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి నగర్ పీహెచ్‌సీ డాక్టర్ శివారెడ్డి, ఎస్‌టీఎల్ఎస్ గోవిందరాజులు, టీబీ హెల్త్ విజిటర్ లక్ష్మీరెడ్డి, ఏఎన్ఎం, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మార్కాపురం-ఒంగోలు రోడ్డు దుస్థితి



రోడ్డుకు అడ్డంగా ఏర్పడిన భారీ గుంత



రోడ్డుపై గుంతలు ఏర్పడి లేచిన కంకర

రద్దీ రోడ్డుపై అడుగుకో గుంత

మార్కాపురం:

మార్కాపురం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధానమైన మార్కాపురం చెరువుకట్ట రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. సంక్రాంతి పండగకు రోడ్లను బాగు చేస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరకపోగా ఉగాది పండగ కూడా మరో నాలుగు రోజుల్లో రానుంది. ఈ నెల 8న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం వస్తున్నారన్న సమాచారంతో 7వ తేదీన అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టేందుకు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చేందుకు మరస మట్టిని తోలారు. హెలీప్యాడ్ మారడంతో అధికారులు తక్కున రూటుమార్చి తర్లుపాడు రోడ్డుకు మరమ్మతులు చేశారు. దీంతో బాగుపడుతుందనుకున్న చెరువుకట్ట రోడ్డు ఎలాంటి రిపేర్లకు నోచుకోలేదు. ముఖ్యంగా మార్కాపురం నుంచి పొదిలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటు మార్కాపురం రైల్వే స్టేషన్‌తో పాటు పట్టణం నుంచి రాయవరం, ఎస్టేట్, కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, గోగులదిన్నె, కేతగుడిపి, బుద్దపల్లి, తుమ్మలచెరువు, ఓబాయపల్లి, మంగళకుంట, గానుగపెంట, పోతలపాడు, గజ్జలకొండ, క్రిస్టియన్‌పాలెం, మల్లంపేట, మన్నెంవారిపల్లి, మొద్దులపల్లి, యాచవరం, నాయుడుపల్లి ఇలా సుమారు 20 గ్రామాలకు పైగా ప్రజలు ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రధానమైన చెరువుకట్ట రోడ్డు సుమారు 2 కిలోమీటర్లకుపైగా గుంతలు పడి ప్రయాణికుల, వాహనదారుల ప్రయాణానికి పరీక్ష పెడుతోంది. అధికారులు రోడ్లకు ఇరువైపులా తోలిన మరస మట్టినైనా గుంతలకు పోసుంటే కాస్త బాగుండేదని ప్రయాణికులు భావిస్తున్నారు. ఈ రోడ్డుపై సబ్ కలెక్టర్, డీఎస్పీ, ఆర్అండ్‌బీ ఈఈ, పంచాయతీరాజ్ ఈఈ, ఎమ్మెల్యే, ఇంకా ఇతర శాఖల అధికారులు ప్రయాణిస్తూ ఉంటారు. అంతేకాకుండా మార్కాపురంలో సమీక్ష సమావేశానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు కూడా వస్తున్నా ఈ రోడ్డు రిపేర్లకు నోచుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రానికి వెళ్లే ఈ రహదారి మీదుగా సుమారు రోజూ ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు, లారీలు, టూవీలర్లు కలిపి వెయ్యికిపైగా వెళ్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధానమైన ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పూడ్చేందుకు తోలిన మరస మట్టి

రోడ్డు పేరు:
మార్కాపురం-ఒంగోలు రోడ్డు (చెరువుకట్ట రోడ్డు)
రోజూ ప్రయాణించే అన్నీ రకాల వాహనాలు:
1000 పైగా
ఈ రోడ్డుపై ప్రజలు వెళ్లే గ్రామాలు:
14 గ్రామాలు
ఈ రోడ్డు నుంచి వెళ్లే ప్రధాన పట్టణాలు:
కొనకనమిట్ల, పొదిలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి

కస్తూరిబాలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. 2025–26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపీసీ)లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. మిగతా తరగతులకు సంబంధించి ఖాళీల ఆధారంగా దరఖాస్తులుకు అనుమతి ఇస్తామన్నారు. వివరాలకు 85007 23716, 8897710857 నంబర్లను సంప్రదించాలని సురేఖ సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రఫీ

మార్కాపురం టౌన్: తల్లీ,బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న వేతనం కేవలం 7,870 రూపాయలు మాత్రమేనని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్త టెండర్లలో పాత వారిని కొనసాగించాలని కోరారు. ఉద్యోగుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విజయ్‌కుమార్, గంగయ్య, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ సూపరింటెండెంట్‌కు అస్వస్థత



విజయలక్ష్మిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది



100 పడకల ప్రాంతీయ వైద్యశాల భవనం

● ప్రైవేటు వైద్యశాలకు తరలింపు

గిద్దలూరు రూరల్: వంద పడకల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో స్టాఫ్ నర్స్ సూపరింటెండెంట్ బీపీ ఎక్కువై పడిపోవడంతో ఆమెను సిబ్బంది సీటీ స్కాన్ తీసేందుకు హుటాహుటిన ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గిద్దలూరు పట్టణంలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ 100 పడకల ప్రాంతీయ వైద్యశాలలో స్టాఫ్ నర్స్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.విజయలక్ష్మికి బీపీ అధికమవడంతో కళ్లు తిరిగి కిందపడిపోయిన సంఘటన మంగళవారం జరిగింది. దీంతో వైద్యశాలలోని వైద్య బృందం ఆమెకు చికిత్స అందించి అనంతరం సీటీ స్కానింగ్ కోసం 108 అంబులెన్స్‌లో పట్టణంలోని డీజీఆర్ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అంత వరకు బాగానే ఉంది. ప్రాంతీయ వైద్యశాలకు వచ్చిన రోగులు మాత్రం ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న వారికే ప్రాణం మీదకు వస్తే వెంటనే ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తున్నారా అంటూ ఒకరినొకరు ముఖాలు చూసుకున్నారు. ఇంత పెద్ద హాస్పిటల్ ఉన్నా ప్రాణాలను నిలిపే యంత్రాలు లేవా అంటూ ప్రశ్నించుకుంటున్నారు. వైద్య బృందానికే ప్రాణం మీదకు వస్తే ఆదుకోలేని ఇంత పెద్ద ప్రభుత్వ వైద్యశాలలు ఎందుకు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొత్తం రూ.24 కోట్ల నిధులతో 100 పడకల వైద్యశాల భవనం, ప్రహరీ, వైద్యశాల ఆవరణలో సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. రోజుకు 400 కు పైగా ఓపీ వస్తుంటుంది. వైద్యశాలలో ఎక్స్‌రే, రక్తపరీక్ష ల్యాబ్, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఒక సూపరింటెండెంట్, 23 మంది వైద్యులు ఉన్నారు. 35 మంది నర్సులు, 7 మంది ల్యాబ్ టెక్నీషియన్స్, ముగ్గురు ఎక్స్‌రే సిబ్బంది, ఇతర శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్న వైద్యశాలలో సీటీ స్కానింగ్ లేకపోవడం వల్ల అందులో పనిచేస్తున్న వారికి సైతం ప్రాణం మీదకు వస్తే బయట వైద్యశాలకు తరలిస్తున్నారు. గిద్దలూరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే 100 కిలో మీటర్లు దూరం ప్రయాణం చేయాల్సిందే.

పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరం



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరమని స్థానిక ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం ప్రకారం లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, ఉద్యోగాన్ని సైతం కోల్పోవాల్సి వస్తుందన్నారు. 18 ఏళ్ల వయస్సులోపు పిల్లలపై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని సెక్షన్ల వారీగా చట్టాల తీవ్రతను వివరించారు. నేరం చేయడం, నేరస్తులకు సహకరించడం శిక్షార్హమేనన్నారు. పాఠశాల స్థాయిలో శిక్షల పట్ల అప్రమత్తత అవసరమని, విద్యార్థుల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షణికానందం కోసం తప్పులు చేస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లు మాల్యాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న చిరంజీవి

మార్కాపురం టౌన్: పశ్చిమ ప్రకాశంలో ఈ నెల 27న జరగనున్న మండల పరిషత్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి సూచించారు. మంగళవారం మార్కాపురం ఎంపీడీవో కార్యాలయంలో మార్కాపురం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలేనికి చెందిన రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, కలెక్టర్ సూచనల మేరకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. మార్కాపురం ఎంపీపీ, త్రిపురాంతకం ఎంపీపీ, ఎర్రగొండపాలెం మండల సభ్యుని, పుల్లలచెరువు మండల ఉపాధ్యక్షుడు పోస్టుకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల విధులను కమిషన్ ఆదేశాలను రిటర్నింగ్ అధికారులకు వివరించారు. డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, మండలాల రిటర్నింగ్ అధికారులు వందర్‌మ్యాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపేంద్రకుమార్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం..భక్తి పరవశం!



అలంకరణలో ఉత్సవమూర్తులు



స్వామివారి ఉత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

కొనకనమిట్ల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి 13 రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ వెంకటేశ్వర స్వామి రోజుకొక అవతారంలో దర్శనమివ్వడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పునీతులయ్యారు. చివరి రోజు మంగళవారం పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, ధ్వజా అవరోహణ, ఏకాంతసేవ, కుంభప్రోక్షణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిసాయి. ముందుగా శ్రీవారి పుష్కరిణి దగ్గర శ్రీవారికి, పెరుమాళ్ల స్వామికి చక్రస్నానం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అలంకరించిన వాహనంపై వెలుగొండ పురవీధుల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. వేదపండితులు తిప్రసాదాచార్యులు, భార్గవచార్యులు పర్యవేక్షణలో ఉభయదాతలు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగటానికి సహకరించిన అన్నీ శాఖల వారికి ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగిన 13 రోజుల పాటు స్వామివారి పల్లకిని మోతకాపులు మోసి తమ భక్తిని చాటుకున్నారు. తర్లుపాడు మండలం గండ్లోపల్లి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు పూర్వం నుంచి ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో శ్రీవారి పల్లకిని మోయటానికి రావటం ఆనవాయితీ. నిత్యం ఆలయం వద్ద ఉంటూ రోజూ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనటం మోతకాపుల ఆచారం.

సత్యమార్గంలో పయనిద్దాం

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: ప్రతి ఒక్కరూ సత్యం, అహింస మార్గాల్లో నడిస్తే సమాజమంతా సంతోషంగా ఉంటుందని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని ఎస్ఎస్ నగర్ ప్రాంగణంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకచోట చేర్చి ప్రజల సందర్శనార్థం ఉంచడం అభినందనీయమన్నారు. ప్రతి మనిషికి ఆధ్యాత్మికత భావనలు ఉండాలని, రోజూ కొంత సమయాన్ని దైవ ప్రార్థనకు కేటాయించాలని కోరారు. బ్రహ్మకుమారి సరస్వతీ అన్నా రాంబాబుకు ప్రసాదం అందజేశారు. ఆర్యవైశ్య సంఘ కోశాధికారి రామడుగు రమేష్, బీవీ రెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే విజయ

బేస్తవారిపేట: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారని ప్రొహిబిషన్–ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే విజయ అన్నారు. మండలంలోని చెన్నుపల్లిలో కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తే 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తారన్నారు. నాటుసారా తాగడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని, నాటు సారా రహిత గ్రామంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్–ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏ జనార్దనరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ డీ బాలయ్య, సీఐ ఎస్ కొండారెడ్డి, తహసీల్దార్ జితేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమరలింగన్న

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ చేపట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ దక్షిణ మధ్య ధర్మజాగరణ ప్రముఖ్ అమరలింగన్న అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వితాసుబ్బరత్నం కల్యాణ మండపంలో హిందువులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయం కేంద్రాలుగా ధార్మిక చైతన్యం కోసం ప్రతి హిందూ సోదరుడు కృషి చేయాలన్నారు. హిందువులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా సంస్థ నిర్వాహకులు సూరే క్రిష్ణారావు, విజయ్‌కుమార్, రమణయ్య, కొండారెడ్డి, ఏనుగుల పద్మావతి, బీజేపీ నాయకులు డా.జే.వి. నారాయణ, ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు పంచాయతీలో అభివృద్ధి శూన్యం

● డ్రైనేజీ వ్యవస్థ లేదంటూ సభలో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీటీసీలు

కొమరోలు: గ్రామ పంచాయతీ వ్యవస్థ దారుణంగా ఉంది. పట్టణంలో అభివృద్ధి శూన్యమని స్థానిక ఎంపీటీసీ షేక్ మౌలాలి, షేక్ సుభాని ఈవోఆర్‌డీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరోలు 1, 2 ఎంపీటీసీలు షేక్ మౌలాలి, షేక్ సుభాని మాట్లాడుతూ చిన్నపాటి వర్షం పడినా రహదారులపై వర్షం నీరు నిలబడి అధ్వానంగా తయారవుతున్నాయని, పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ఎన్నో పర్యాయాలు సమస్యలపై ప్రశ్నించినా అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా సర్పంచ్ అందుబాటులో ఉండకపోవడంతో కొమరోలు గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. బాదినేనిపల్లె గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని ఎంపీటీసీ శ్రీనివాసుల రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులును ప్రశ్నించారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌కార్యాలయ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగలతో ఆయన మాట్లాడారు. తొలుత రికార్డులు పరిశీలించారు. హౌస్ ఓల్డ్ సర్వే, నిరుద్యోగులు ఎవరైనా ఖాళీగా ఉన్నారా వంటి సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మకు మండల అభివృద్ధిపై తగు సూచనలు అందజేశారు. ఈఓఆర్డీ శ్రీదేవి, పాల్గొన్నారు.